క్లుప్తంగా

6న సామూహిక సత్యనారాయణ వ్రతం



మాట్లాడుతున్న శివకుమార్

గూడూరురూరల్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవన్‌లో ఈనెల 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని అధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్ తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన పండితోపన్యాసకులు, రిటైర్డ్ తెలుగు పండిట్ బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణి శర్మ దంపతుల ఆధ్వర్యంలో వ్రతం జరుగుతుందన్నారు. కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, రామమూర్తి, పురుషోత్తమరావు, డి.బి.శ్రీనివాసరావు, వీఎల్ నరసింహం, ప్రకాశం పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపాలి



పట్టాలు చేతపట్టుకుని ఆందోళనకు దిగిన నిర్వాసితులు

దొరవారిసత్రం: శ్రీహరికోట నిర్వాసితులకు గతంలో ఇంటి స్థలాలు కోసం ఇచ్చిన పట్టాలకు నివేశ స్థలాలు చూపాలంటూ గురువారం దొరవారిసత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆరు నెలలుగా ఇంటి స్థలాలు చూపాలంటూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ శైలకుమారికి వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన తహసీల్దార్ శనివారం, ఆదివారం శ్రీహరికోట నిర్వాసితుల నివేశ స్థలాలను పట్టాలు ప్రకారం సర్వే చేసి బాధితులకు ఇంటి స్థలాలు చూపిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

బలవంతపు భూసేకరణ నిలిపేయాలి



మాట్లాడుతున్న పోలయ్య

సైదాపురం: ఎండోసోల్ కంపెనీ కోసం బలవంతపు భూ సేకరణను వెంటనే నిలిపేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉలవపాడు మండలంలోని కరేడు, ఉప్పలపాళెం, రామకృష్ణాపురం గ్రామాల్లో రైతుల సారవంతమైన భూములను ఎండోసోల్ సోలార్ కంపెనీ కోసం తలపెట్టిన భూసేకరణ వెంటనే నిలిపేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రాపూరు: డెంగీ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రమీల రాజకుమారి అన్నారు. రాపూరులో గురువారం డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సూర్యధర్మేంద్ర, భాను, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తయారీ కేంద్రం పరిశీలన



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలోని చెత్త తయారీ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం భవాని గురువారం పరిశీలించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ రమేష్‌బాబు, పంచాయతీ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

వాకాడు: స్థానిక గురుకుల పాఠశాల సమీపంలోని మురారి వెంకటయ్య, దీనమ్మ దంపతులకు చెందిన పూరిల్లు గురువారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సమాచారం అందుకున్న కోట అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.25 వేల విలువ చేసే వస్తువులు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

శిథిలావస్థలో పీహెచ్‌సీ

- ఆగిన నూతన భవన నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న రోగులు, సిబ్బంది



చిట్టమూరు పీహెచ్‌సీ భవనం

చిట్టమూరు : స్థానిక పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది. దీంతో వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ భవనం నిర్మించి 22 ఏళ్లు అవుతోంది. అప్పట్లో పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో భవనం దెబ్బతినిందని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో భవనం ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో రూ.50 లక్షలతో నూతన భవనం నిర్మించేందుకు కూటమి నేత ఆర్భాటంగా భూమి పూజ చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గోతులు తవ్వి పిల్లర్ల వరకు పని చేసి వదిలేశారు. కమ్మీ వర్షానికి తడిసి తుప్పుపడుతోంది. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ చిన్నరాయుడు వివరణ ఇస్తూ నూతన భవన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కాంట్రాక్టర్ ఇబ్బందుల వల్ల పనులు ఆగిపోయాయని, వర్షాకాలం వచ్చేలోపు భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.



పిల్లర్లకే పరిమితమైన నిర్మాణ పనులు



పెచ్చులూడుతున్న బండ పైకప్పు



వర్షానికి తడుస్తున్న బెడ్లు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

– సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరురూరల్: నియోజకవర్గ అభివృద్ధికి పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ ద్వారా కృషి చేస్తామని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పారిశ్రామికాభివృద్ధి సాధించడంతోపాటు ఉపాధి అవకాశాలు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమగ్ర అభివృద్ధి సాధించాలని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎన్నారైలు, పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలని, అధికారులు, మేధావులు సూచనలు, సలహాలు అందించాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కోరారు. డీఎస్పీ గీతాకుమారి పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్ జయించవచ్చు



పింక్ బస్సు ముందు వైద్య సిబ్బంది

వెంకటగిరి రూరల్: స్క్రీనింగ్ వైద్య పరీక్షలతో క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చునని బంగారుపేట పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివకృష్ణారెడ్డి తెలిపారు. తిరుపతి స్వీమ్స్ ఆధ్వర్యంలో వెంకటగిరి రూరల్ మండలంలోని జంగాలపల్లి, పారవోలు గ్రామాల్లో పింక్ బస్సుల ద్వారా ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పింక్ బస్సుల ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల వల్ల ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించి నివారించేందుకు దోహదపడుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ జినీత, స్వీమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్యభాను, ఎంపీపీ తనూజారెడ్డి, కార్యదర్శి బాలకృష్ణ సూపర్‌వైజర్ సుశీలమ్మ, సీహెచ్‌ఓలు కె మమత, భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ఇంద్రాణి, ఆర్.సామ్రాజ్యం పాల్గొన్నారు.

సర్వే చేసి నివేదిక ఇస్తాం



పిట్టివానిపల్లిలో రొయ్యల గుంతలను పరిశీలిస్తున్న ఫిషరీస్ అధికారి

చిట్టమూరు: మండల పరిధిలోని పిట్టివానిపల్లిలో రొయ్యలు గుంతల వివాదం మూడు శాఖల అధికారులు సర్వే నిర్వహించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మత్స్యశాఖ సహాయ సంచాలకులు రఘుబాబు అన్నారు. పిట్టివానిపల్లిలో మల్లాం గ్రామానికి చెందిన కూటమి పార్టీ సానుభూతి పరులు రొయ్యలు గుంతలకు కొంత మేర మాత్రమే అనుమతులు తీసుకుని 40 ఎకరాల్లో అక్రమంగా సాగు చేస్తూ కలుషిత నీటిని గ్రామంలోకి వదులుతున్నారని పంచాయతీ సర్పంచ్ పిట్టి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈక్రమంలో ఫిషరీస్ సహాయ సంచాలకులు గురువారం రొయ్యలు గుంతలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిట్టివానిపల్లిలో రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ అధికారులు కలసి సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అయితే గ్రామస్తులు మాత్రం తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన ఆపమని అధికారులకు తెగేసి చెప్పారు. ఫిషరీస్ అసిస్టెంట్ వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొలం కట్టవ ఆక్రమణ

-బాధితుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మస్తానయ్య

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని పాకపూడి గ్రామంలో కస్తూరి మస్తానయ్య వ్యవసాయ పొలం కట్టవను సుమన్ అక్రమించారని గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేశారు. మస్తానయ్య మాట్లాడుతూ తమ తాత ముత్తాతాతల కాలం 80 సంవత్సరాల నుంచి పొలంలో కట్టవ వేసుకొని సాగుచేస్తున్నట్లు తెలిపారు. అయితే వ్యవసాయ పొలం కట్టవను జేసీబీతో తొలగించారని వాపోయారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్‌ఐ గోపికి ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన అధికారులు సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు కలప ట్రాక్టర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

సైదాపురం: అనుమతులు లేకుండా తరలిస్తున్న రెండు కలప ట్రాక్టర్లను గురువారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈసంఘటన లింగసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. కలపను నరికేసి ఇతర ప్రాంతాలకు అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు నెల్లూరు అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో గురువారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో లింగసముద్రం నుంచి గూడూరుకు వేప, కలపను లోడ్ చేసుకుని వెళుతున్న రెండు ట్రాక్టర్లను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న రెండు ట్రాక్టర్లు స్థానిక టీడీపీ నేతవిగా అధికారులు గుర్తించారు.

డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

వాకాడు: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని గురువారం ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ చంద్రయ్య, ప్రెసిడెంట్ సంపత్, జాయింట్ సెక్రటరీ పోలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్, ప్రచార కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వాకాడు: ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలు, అలాగే ఏకపక్ష నిర్ణయాలపై ప్రశ్నించిన జెడ్పీటీసీ సభ్యుడిపై కూటమి నాయకుల ఒత్తిళ్లతో తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి వాకాడులో విలేకరుల సమావేశం నిర్వహించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ వాలమేడు గ్రామంలో అధికారులు కొన్ని రోజులుగా పార్టీలుగా విభజించి ఉపాధి కూలీలను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. ఈ విషయమై జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ నలుగురు కూలీలతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఉపాధి అధికారులను ఇదేమిటని ప్రశ్నించినందుకు దళిత జెడ్పీటీసీ సభ్యుడుతోపాటు మరో నలుగురిపై తప్పుడు కేసులు పెట్టడం అన్యాయమన్నారు. నేతలు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, పెంచలరెడ్డి పాల్గొన్నారు.

కౌలు వేలం వాయిదా



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చిల్లకూరు: కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల కౌలు వేలం పాటను వాయిదా వేసినట్లు గురువారం ఆలయ ఈఓ రవిక్రిష్ణ తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కౌలు వేలానికి పాటదారులు ఎవ్వరూ రాకపోవడంతో మరోసారి నిర్వహించేందుకు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఆలయానికి చెందిన 80 ఎకరాల మెట్ట భూమిని ఐదేళ్లకు లీజుకు ఇచ్చేందుకు వేలం ఏర్పాటు చేశామన్నారు. అలాగే మరో వేలం పాటలో ఆలయంలో క్లాత్ పందిరి నిర్వహించుకునే హక్కు కోసం జరిగిన వేలంలో రూ.1.80 లక్షలకు చింతవరానికి చెందిన వ్యక్తి దక్కించుకున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, నెలాటూరు చిరంజీవి పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోవాలి



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బాలాయపల్లి(సైదాపురం): సచివాలయం సిబ్బంది పనితీరు మార్చుకోవాలని ఎంపీడీఓ వినీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నిడిగల్లు గ్రామ సచివాలయంలో హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. కాలగంద గ్రామంలో పాఠశాల విలీనంపై పిల్లలు అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జయంపు గొట్టికాడు, పాకపూడిలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌రాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల మాయాజాలం

-రెవెన్యూ రికార్డులో పేర్లు మార్పు
-రిటైర్డ్ తహసీల్దార్, వీఆర్వోపై ఫిర్యాదు



పొలం పత్రాలను చూపుతున్న బాధితులు

వెంకటగిరి రూరల్: రెవెన్యూ అధికారులు మాయా జాలంతో ఎన్నో ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని రాత్రికి రాత్రే అధికారులు రికార్డులు మార్చేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ పొలానికి సంబంధించిన పత్రాలతో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. బాధితులు మాట్లాడుతూ మండలంలోని పాలకొండ సత్రం పంచాయతీ పరిధిలో భాగ్యలక్ష్మి, భర్త వెంకటస్వామి దంపతుల పేరు మీద వ్యవసాయ భూమి ఉందన్నారు. ఇందుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, డాక్యుమెంట్లు, 1బీ అడంగల్ రికార్డు కూడా ఉందని తెలిపారు. అయితే వెంకటగిరి తహసీల్దార్‌గా గత నెల 30న రిటైర్డ్ రాంబాబు హయాంలో తమ వ్యవసాయ భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. ఈ మేరకు రిటైర్డ్ తహసీల్దార్ రాంబాబు, స్థానిక వీఆర్వో కృష్ణపై చర్యలు తీసుకోవాలంటూ ప్రస్తుత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కోట: గూడలిలో తాగునీటి సమస్యను గురువారం అధికారులు పరిష్కరించారు. మంచినీటి పథకానికి సంబంధించిన విద్యుత్ మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరా లేక గ్రామస్తులు మూడు రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఫిర్యాదు మేరకు వెంటనే ప్రత్యామ్నాయంగా మోటార్లు ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ తెలిపారు.

నోటీస్ బోర్డు

7న మండల మీట్

- సైదాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ రవీంద్రబాబు తెలిపారు. సమావేశానికి సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

10న సర్వసభ్య సమావేశం

- రాపూరు: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న మండల కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవాని ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీస్

కలువాయి(సైదాపురం): మండలంలోని ప్రధాన పీహెచ్‌సీ కలువాయి నందు పనిచేస్తున్న ఆశా వర్కర్లు, గురువారం డాక్టర్‌లకు తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని ఈనెల 9న కలువాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు ఆశా వర్కర్లు తెలిపారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్టం చేయాలని, వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని వివిధ షరతులతో కూడిన సమ్మె నోటీసులో తెలిపారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు, అక్కగారిపేట గ్రామాల్లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన పనులు సకాలంలో పూర్తిచేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి అధికారులను ఆదేశించారు. గురువారం చిల్లకూరు, అక్కగారిపేట గ్రామాల్లో జరుగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. 71వ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు సమీపంలో ఉన్న భవనాలను తొలగించారని, నూతన భవనాల నిర్మాణం కోసం మంజూరైన నిధులతో సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఈసందర్భంగా ఆమె తెలిపారు.

వృద్ధాశ్రమానికి చేయూత



దుప్పట్లు ఇస్తున్న నేతలు

గూడూరురూరల్: ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) 75వ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి చేయూత అందించారు. మహబూబ్‌బాషా, మీరా సాహెబ్, క్లైయిమ్ ఏఓ శర్మ దాతృత్వంతో రెండు డైనింగ్ టేబుళ్లు, రెండు బస్తాల బియ్యం, దుప్పట్లు, కొబ్బరినూనె, సోపులు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఐసీఈయూ బ్రాంచ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా, శర్మ, మీరాసాహెబ్, యోగి పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులే!

- నిన్న మాజీ జెడ్పీటీసీ, నేడు ప్రస్తుత జెడ్పీటీసీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఉపాధి పథకంలో జరిగే అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో జరిగే ఉపాధి పథకం ఒక వరంలా మారడంతో కూటమి నేతలు ఈ పథకాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. గ్రామాల్లో వారు ఎక్కడ పనిచేయాలని చెబితే అక్కడ చేయడం క్షేత్రసహాయకులుగా ఎవరిని నియమించమంటే వారిని నియమించుకోవడం, ఏకపక్షంగా కూలీలను ఎంపిక చేసి వారికి మాత్రమే పని కల్పించేలా చేస్తున్నారు. దీంతో ఉపాది పథకంలో జరిగే లక్షలాది రూపాయల పనులు నాణ్యత లేకుండా తూతూ మంత్రంగా చేసి కూటమి నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారు. కడుపు మండిన కూలీలు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓల సమక్షంలోనే ప్రశ్నిస్తే ఉపాధి ఏపీఓలు మహిళమైన మమ్మల్ని బెదిరించారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారు. గూడూరు నియోజకవర్గంలో గత ఆరు నెలల క్రితం కోట మండలం మాజీ జెడ్పీటీసీపై అక్రమ కేసు నమోదు కాగా రెండు రోజులు క్రితం వాకాడు మండల జెడ్పీటీసీపై అక్రమ కేసులు బనాయించారు. కోట మండలం కొత్త పట్నం గ్రామంలో జరిగిన ఉపాది పనుల్లో అవినీతి చోటుచేసుకుంటోందని అలాగే తమకు పనులు కల్పించకుండా ఒక గ్రూప్ సభ్యులకే పనులు కల్పిస్తున్నారని కోట మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్ గౌడ్‌తో కలిసి కొంత మంది కూలీలు అప్పటి కోట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వేణుకు ఫిర్యాదు చేశారు. అయితే మహిళా ఏపీఓపై కూటమి నాయకుల ఒత్తిడి చేసి తనపై మాజీ జెడ్పీటీసీతో పాటు కూలీలు దౌర్జన్యానికి దిగారని అక్రమకేసు బనాయించారు. దీంతో మాజీ జెడ్పీటీసీపై మిగిలిన వారిపై కేసులు పెట్టారు. ఇదే క్రమంలో రెండు రోజుల క్రితం వాకాడు మండలంలో వాలమేడు గ్రామంలోని ఉపాది పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకుంటోందని, అలాగే కూటమి నేతలు చెప్పిన వారికే పనులు కల్పిస్తూ ఏకపక్షంగా మహిళా ఏపీఓ వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ రామక్రిష్ణతోపాటు పది మంది కూలీలు వాకాడు ఎంపీడీఓ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీఓ ఆమెను పిలిపించి విచారణ చేయడంతో ఆమె కూటమి నాయకుల ప్రోద్బలంతో జెడ్పీటీసీతో పాటు కూలీలు తనను దుర్భాషలాడారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అక్రమంగా జెడ్పీటీసీ రామక్రిష్ణతోపాటు మరో పది మందిపై కేసులు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

జెడ్పీటీసీపై పెట్టిన అక్రమ కేసు ఎత్తేయాలని ఎమ్మెల్సీ వినతి

వాకాడు జెడ్పీటీసీ రామక్రిష్ణపై పెట్టిన అక్రమ కేసును తొలగించాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజును కలసి విన్నవించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మండల స్థాయి అధికారి సమక్షంలో ఒక ప్రజాప్రతినిది ఏపీఓను ప్రశ్నిస్తే దానిని ఆమె వక్రీకరిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడం దానిని పోలీసులు కనీస విచారణ కూడా చేయకుండా కేసు నమోదు చేయడం సబబు కాదన్నారు. దీనిపై విచారణ చేసి నిగ్గు తేల్చాలని తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు